సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 7 । జూన్ । 2025



చెయ్యేరులో..ఇసుక దందా!
నాణ్యమైన ఇసుకకు నిలయమైన చెయ్యేరులో ఇసుక దందా కొనసాగుతోంది. తెలుగు తమ్ముళ్లు జేసీబీలతో తోడేస్తున్నారు.
-10లో



గుప్త నిధుల ముఠా విధ్వంసం
పెద్దతిప్పసముద్రం మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో గుర్తుతెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు.
-10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.140
రెండోరకం	రూ.60	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1650 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అరుణాచలానికి ప్రత్యేక బస్సు
రాయచోటి జగదాంబసెంటర్: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం అరుణాచలానికి పౌర్ణమి పురస్కరించుకుని ఈ నెల 10వ తేదీన ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు రాయచోటి ఆర్టీసీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు బద్వేల్ ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సులు నడపనుండగా కడపలో 10.30 గంటలకు బయలుదేరుతుందన్నారు. రాయచోటిలో బంగ్లా బస్టాప్ నుండి 11.45 గంటలకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. రాయచోటి నుంచి చార్జీ రూ.1050 ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రాయచోటి పరిసర ప్రాంతాల భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనులు శరవేగంగా పూర్తి చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్‌గుప్తా

రాజంపేట: రాజంపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజరు చంద్రశేఖర్‌గుప్తా శుక్రవారం పరిశీలించారు. తిరుపతికి వెళుతూ మార్గమధ్యలో అమృత్‌భారత్ కింద జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.పనులు నత్తనడకలో జరుగుతున్నాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే డీఆర్‌ఎం పరిశీలించినట్లు రైల్వే వర్గాలు అంటున్నాయి.

పారా స్పోర్ట్స్‌లో విద్యార్థినుల ప్రతిభ

మెడల్స్‌తో శివానీ


చందన

మదనపల్లె సిటీ: పారా స్పోర్ట్స్‌లో నవోదయ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. గోల్డ్ మెడల్స్ సాధించారు. ఇటీవల జాతీయ స్థాయిలో గుజరాత్, కర్నాటక రాష్ట్రాలతో పాటు థాయ్‌లాండ్‌లో ఆదిత్య మెహత ఫౌండేషన్, నవోదయ విద్యాలయ సమితి సంయుక్తంగా పోటీలు నిర్వహించారు. ఇందులో దివ్యాంగురాళ్లయిన శివాని, చందన రాణించారు. షాట్‌పుట్ విభాగంలో శివాని మూడు బంగారుపతకాలు, ఒక కాంస్యం పతకం సాధించింది. 100 మీటర్ల పరుగు పందెంలో ఒకటి, జావలిన్‌త్రోలో నాలుగు బంగారు పతకాలు దక్కించుకుంది. కె.చందన హ్యాండ్ సైక్లింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించింది .వీరిని విద్యాలయంలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఎం.గీత, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్,అధ్యాపకులు అభినందించారు. నవోదయ విద్యాలయ హైదరాబాదు రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

గ్రామసభలో పాల్గొన్న కేంద్రబృందం నోడల్ అధికారి శిశ్యపాల్ సేథి

పెద్దమండ్యం: జలజీవన్ మిషన్(జేజేఎం) ద్వారా చేపట్టిన పనులను కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని బండమీదపల్లె గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ మొలక బయ్యారెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. 2021లో జేజేఎం ద్వారా చేపట్టిన పనుల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వివరించారు. జేజేఎం ద్వారా చేపట్టిన పనులపై విలేజ్‌వర్క్స్ శానిటేషన్ కమిటీ (వీడబ్ల్యూఎస్‌సీ) సభ్యుల పర్యవేక్షణపై కేంద్ర బృందం నోడల్ అధికారి ఆరా తీశారు. ప్రతి ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌ను తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బృందం నోడల్ అధికారి శిశ్యపాల్‌సేథి, డీఆర్‌ఈవో ప్రసన్నకుమార్, ఈఈ రషీద్‌ఖాన్, డిఈ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏఈ అశోక్‌కుమార్, వెలిగల్లు సర్పంచ్ సి సరస్వతి, పంచాయతీ కార్యదర్శి శైలజ, వీడబ్ల్యూఎస్‌సీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ మున్సిపాలిటీ..
రూటే సపరేటు



- సొంత నిర్ణయంతో 80 మంది పారిశుద్ధ్య కార్మికుల నియామకం
- ప్రభుత్వం వద్దన్నా.. లెక్క పెట్టని అధికారులు
- ఒక్కొక్కరికి రూ.15 వేల వేతనం
- ప్రీ ఆడిట్ తనిఖీల్లో కదిలిన డొంక
- వాస్తవం దాచిపెట్టి అధికారుల డైవర్షన్

మదనపల్లె: ప్రభుత్వ శాఖల్లో, స్థానిక సంస్థల్లో ఖర్చు చేసే ప్రతి పైసాకు ఆమోదం తర్వాతే ఖర్చు చేస్తారు. దానికి సంబంధించిన అన్ని లెక్కలు పక్కాగా ఉండాల్సిందే. లేదంటే ఆడిట్ లెక్కల్లో బట్టబయలు అవుతుంది. ఇప్పుడు మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలో కుంభకోణాన్ని తలపించే ఓ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అంతా తామై నడిపించిన అధికారులు.. ఇప్పుడు నెపమంతా ఆడిటర్లపై వేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఒకరిద్దరికి సంబంధించిన వ్యవహారం కాదు.. ఏకంగా 80 మంది పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించింది. వివరాల్లోకి వెళితే..

కరోనాలో ప్రభుత్వ అనుమతి..
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనాను కట్టడి చేసేందుకు.. ప్రతి 500 మంది జనాభాకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు ఉండేలా చర్యలు చేపట్టి పనులు ముమ్మరంగా చేయించారు. దీనికోసం మదనపల్లె మున్సిపాలిటీలో 80 మందికి పైగా కొత్తగా దినసరి వేతనం కింద పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. వీరు కాక ఆప్కాస్ కింద 161 మంది, రెగ్యులర్ కింద 61 మంది పని చేస్తున్నారు. కోవిడ్ కోసం తీసుకున్న కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.15 వేలు చొప్పున వేతనాలు చెల్లించింది. కోవిడ్ తర్వాత ఈ నియామకాలు అన్నిటిని ప్రభుత్వం రద్దు చేసింది. అంటే కోవిడ్ కోసం తాత్కాలిక పద్ధతిలో దినసరి వేతనంతో కార్మికులుగా నియమించుకున్న వారిని రాష్ట్ర వ్యాప్తంగా ఏ మున్సిపాలిటీలోనూ కొనసాగినట్టుగా లేదు. అయితే మదనపల్లె మున్సిపాలిటీ ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేసింది.

మదనపల్లెలో కొనసాగింపు
కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను రాష్ట్రం వ్యాప్తంగా మున్సిపాలిటీలు తొలగించాయి. అయితే మదనపల్లె మున్సిపాలిటీలో మాత్రం 80 మందిని ఇప్పటి వరకు కొనసాగిస్తూనే ఉన్నారు. వీరి తొలగింపు ఆదేశాలను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా పక్కన పెట్టారు. దీనివల్ల దినసరి వేతనంతో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెల వేతనాలు చెల్లిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక వీరందరిని పర్మినెంట్ చేస్తారన్న ప్రచారం కూడా చేశారు. దినసరి వేతనంతో పనిచేసేందుకు ప్రభుత్వ అనుమతి లేనప్పుడు వీరిని ఇంకా కొనసాగిస్తున్న అధికారుల ఉద్దేశం ఏమిటి అన్నది అంతు పట్టడం లేదు. కార్మికులను నియమించుకోవడానికి, వేతనాల చెల్లింపునకు ప్రభుత్వ అనుమతి లేకపోయినా కొనసాగిస్తూ అధికారుల చర్య సాహసోపేతమని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పనిచేస్తున్న కార్మికులకు ఈ విషయాలేవీ తెలియదు. అయితే తామంతా దినసరి కార్మికులుగా పనిచేస్తున్నట్టుగానే భావిస్తున్నారు. కానీ ప్రభుత్వ లెక్కలో మాత్రం వీరు లేరు.

కుంభకోణంలా ఉంది
80 మంది పారిశుద్ధ్య దినసరి కార్మికులను కొనసాగిస్తున్న వ్యవహారం ఆషామాషీగా లేదని తెలుస్తోంది. ఒక్కో కార్మికునికి నెలకు రూ.15 వేలు చొప్పున రూ.12 లక్షలు చెల్లిస్తున్నారు. ప్రస్తుత పెండింగ్ వేతనం చూస్తే రూ.60 లక్షలు ఉంది. ఇది కాక ఇప్పటికే చెల్లించింది రూ.కోట్లలో ఉంటుంది. ఇప్పటి వరకు మున్సిపల్ సాధారణ నిధులు నుంచి ఈ వేతనం చెల్లించినట్టు తెలుస్తోంది. అంటే మున్సిపల్ ఖజానాకు భారీగా గండి పెట్టినట్టే. అనధికారికంగా కొనసాగిస్తున్న కార్మికులకు చెల్లిస్తున్నట్టు చెబుతున్న వేతనం నిజంగానే వారికి చేరుతోందా లేదా అన్నది కూడా చర్చనీయాంశమైంది.


మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

ప్రీ ఆడిట్లో డొంక కదిలింది
మున్సిపల్ అధికారులు అనధికారికంగా నియమించుకున్న 80 మంది దినసరి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లింపు విషయంలో ఐదు నెలల క్రితం వరకు ఎవరికీ అనుమానం కలగలేదు. అప్పటి ఆడిట్ అధికారులు వేతనాల చెల్లింపునకు ఏ ప్రాతిపదికన అనుమతులు ఇచ్చారో ఎవరికీ తెలియదు. వేతనాలు మంజూరుకు అంగీకారం తెలిపిన అప్పటి ఆడిటర్ల తీరు ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే ఐదు నెలల క్రితం ప్రీ ఆడిట్ నిర్వహించిన ఆడిటర్లు ఈ విషయాన్ని పసిగట్టారు. 80 మంది కార్మికులకు వేతనాలు చెల్లించడానికి ఏది ప్రామాణికత అన్న ప్రశ్న లేవనెత్తారు. ప్రభుత్వ అనుమతి గానీ, నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు కానీ ఉన్నాయా అని మున్సిపల్ అధికారులను ఆడిటర్లు ప్రశ్నలు మీద ప్రశ్నలు వేశారు. ఈ ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. దీంతో ప్రభుత్వం రద్దు చేసినా కొనసాగిస్తున్న కార్మికులకు వేతనాల చెల్లింపునకు నిబంధనలు వర్తించవని ఖరాఖండిగా తేల్చేశారు. దీంతో ఐదు నెలలుగా వేతనాల చెల్లింపు ఆగిపోయింది.

ఇది నిజమే
దినసరి పారిశుద్ధ్య కార్మికుల కొనసాగింపును ప్రభుత్వం రద్దు చేసిందని పారిశుద్ధ్య నిర్వహణ విభాగం అధికారి ఒకరు స్పష్టం చేశారు. అయితే ఇక్కడ ఏ ప్రాతిపదికన కొనసాగిస్తున్నారో తనకు తెలియదని చెప్పారు. ఇదే విషయమై పారిశుద్ధ్య విభాగం ఏఈ రూపేష్ వివరణ కోరగా తనకేమీ తెలియదని, తన కిందిస్థాయి ఉద్యోగులను అడిగి తెలుసుకోమని సలహా ఇచ్చారు.

కొత్త ఆడిటర్ అనుమతి ఇస్తారట
ఐదు నెలలుగా తమకు వేతనం ఎందుకు ఇవ్వలేదని కార్మికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై సరైన సమాధానం లేకపోగా ఆడిటర్లు అనుమతి ఇవ్వడం లేదంటూ చెప్పుకొస్తున్నారు. ఇప్పుడున్న ఆడిటర్ బదిలీ అవుతారు.. కొత్త ఆడిటర్ వేతనాలు మంజూరు చేస్తారంటూ నమ్మిస్తున్నారు. కార్మికులు ఇదే నిజమని నమ్మి ఎదురుచూస్తున్నారు.కార్మిక సంఘాలు దీనిపై ఆందోళనలో చేస్తున్నా అసలు నిజం వీరికి కూడా తెలియకపోవడం విశేషం.

ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు
మదనపల్లె మున్సిపాలిటీలో దినసరి పారిశుద్ధ్య కార్మికుల వ్యవహారం మున్సిపల్ శాఖకు తెలియదా, ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లలేదా, లేక తెలిసి పట్టించుకోవడం లేదా, అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 80 మంది కార్మికులకు సంబంధించిన వ్యవహారం కనీసం సమస్యగానైనా ఎందుకు గుర్తించలేదో ఉన్నతాధికారులకే తెలియాలి. ప్రతి సంవత్సరం మున్సిపల్ నిధుల వినియోగంపై పర్యవేక్షణ ఏమాత్రం లేదని ఈ వ్యవహారంతో స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందిస్తారో లేదో చూడాలి.

బక్రీద్ శుభాకాంక్షలు
రాయచోటి: మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌లు ఆకాంక్షించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన ఒక పత్రిక ప్రకటన ద్వారా వారు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదినం ఆరాధ్యమైందని, ప్రీతికరమైందన్నారు. ముస్లిం ఆరాధ్య గ్రంథం దివ్యఖురాన్ ప్రకారం త్యాగనిరతికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకుంటారన్నారు.అలాగే రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ మధుసూదన్ రావు కూడా జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం
రాయచోటి జగదాంబసెంటర్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు 2024 సంవత్సరానికి 'టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు'కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు గత మూడు సంవత్సరాల్లో (2022, 2023, 2024) భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారిని పరిగణనలోకి తీసుకుంటారన్నారు. సాహస క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన వారికి జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తారన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహం, ప్రశంసాపత్రం , రూ.15 లక్షల నగదు అందిస్తారన్నారు. ఈ అవార్డు కోసం ఆన్‌లైన్ https|://awards.gov.in ద్వారా ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు వీపీ సుబ్బరాయుడు 9949298810, జూనియర్ అసిస్టెంట్ వివి నారాయణ 98494 97045 నంబర్లలో కార్యాలయ పనివేళలో సంప్రదించాలని తెలియజేశారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష
రాయచోటి/మదనపల్లె సిటీ: ప్రభుత్వ ఉపాధ్యాయుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమైంది.జిల్లాలోని ఆరు కేంద్రాలలో రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించారు. మదనపల్లె డివిజన్ పరిధిలో మూడు, రాయచోటిలో రెండు, రాజంపేటలో ఒక కేంద్రంలో పరీక్ష జరిగింది. ఉదయం,సాయంత్రం రెండు సెషన్స్‌కు సంబంధించి 1363 మంది అభ్యర్థులకు 1137 మంది హాజరుకాగా 226 మంది గైర్హాజరయ్యారు. కలెక్టర్ శ్రీధర్,డీఈఓ సుబ్రమణ్యం, మదనపల్లెలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పరీక్షలను పర్యవేక్షించారు.


పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

యోగాంధ్ర 9కి వాయిదా
రాయచోటి: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ తాళ్లపాకలో నిర్వహించాల్సిన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 617 వసంతాలు పూర్తి చేసుకున్న అన్నమాచార్యులను స్మరిస్తూ తాళ్లపాకలోని ఆయన విగ్రహం వద్ద జూన్ 9న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆయన రచించిన 32 వేల సంకర్తనలకు నివాళిగా అదేరోజున జిల్లా వ్యాప్తంగా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో 32 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

చమర్తికి రాజంపేటలో ఏం పని?
అధిష్టానవైఖరిపై మోకాళ్లపై నిరసన

రాజంపేట: తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు ఇక్కడ ఏం పని అని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం పద్మప్రియ కల్యాణమండపంలో వారు భేటీ అయ్యారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడుకు రాజంపేట ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని కోరారు. గతంలో ఆయన ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా పార్టీకి అండగా నిలిచారన్నారు. ఆయనకు ఇన్‌చార్జి ఇస్తే అసలుసిసలైన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజంపేటకు సంబంధంలేని వ్యక్తికి ఇన్‌చార్జి ఇస్తే పార్టీ క్యాడర్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారకులు ఎవరన్నది అధిష్టానం గుర్తించి, నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.కార్యకర్తలను పలుకరించని వారికి ఇన్‌చార్జి ఇస్తే క్యాడర్ కాలగర్భంలో కలిసిపోవాల్సిందేనని వాపోయారు. అనంతరం రాజంపేట ఇన్‌చార్జి పదవి బత్యాలకు ఇవ్వాలని కోరుతూ మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌లను వేడుకుంటున్నామన్నారు. ఇదిలా ఉంటే.. బలిజ సామాజికవర్గానికి చెందిన నేతలందరూ బత్యాల కోసం ఏకమవుతూ, ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకుని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి.


రాజంపేటలో మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

జూన్.. టెన్షన్

- బడి ఫీజు భయపెడుతోంది....!
- తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు
- నగటు జీవులపై అదనపు భారం

❒ మదనపల్లె పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ తన మూడేళ్ల కూతురుని ఎల్‌కేజీలో పాఠశాలలో చేర్పించేందుకు సమీపంలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌కు వెళ్లాడు. ఏడాదికి రూ.30 వేలు అని యాజమాన్యం చెప్పింది. పుస్తకాలు, యూనిఫాం, బెల్టు,స్టేషనరీ అదనంగా చెల్లించాలన్నారు. ఇదేమిటని అడిగితే ఇక్కడ ఇలానే ఉంటుందని పాఠశాల నిర్వాహకులు సమాధానం చెప్పడంతో కంగుతిన్నాడు. ప్రవేశాలు ముగుస్తాయని, ఆలస్యమైతే సీటు దొరకదని యాజమాన్యం చెప్పగా ఇంటికి దగ్గర్లో ఉన్న పాఠశాలలో రూ.వెయ్యి చెల్లించి అడ్మిషన్ ఖాయం చేసుకున్నాడు.

❒ వాల్మీకిపురానికి చెందిన వెంకటేష్‌కు ఒక కుమారుడు. మూడో తరగతి పూర్తి చేశాడు. ఓ కార్పొరేట్ పాఠశాలలో చేర్పిద్దామని ఇటీవల అక్కడికి వెళ్లగా నాలుగో తరగతికి ఫీజు రూ.45 వేలుగా తేల్చేశారు. మూడో తరగతికి వెంకటేష్‌కు కట్టిన ఫీజు రూ.20వేలు. ఏకంగా రెట్టింపు స్థాయిలో ఫీజులు ఉండటంతో కొత్తబడిలో చేర్పిద్దామనే ఆలోచనకు స్వస్తి పలికి పాత పాఠశాలలోనే కొనసాగించాలని నిర్ణయానికి వచ్చాడు.



మదనపల్లె సిటీ: జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి. మరో వారం రోజుల్లో పాఠశాలలు తెరచుకోనున్నాయి. ఇప్పటికే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని, విద్యా సామగ్రి కొనుగోలు చేయాలని చెబుతుండటంతో పేద,మధ్యతరగతి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. కొత్త పుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి కొనాలంటూ ఒత్తిడి మొదలవడంతో తల్లిదండ్రులపై భారం పడుతోంది. ఏటా విద్యా సంవత్సరం జూన్ 13వతేదీ ప్రారంభమైనా నెలంతా హడావిడి మొదలవుతుంది. సాధారణ కుటుంబాల నుంచి మధ్య తరగతి, ఉద్యోగుల వరకు ఒకటే గుబులు. పిల్లల చదువులకు ఏ లోటు లేకుండా అన్ని అందించాల్సిన పరిస్థితి. జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో 2,54,630 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ప్రైవేటు పాఠశాలల్లో 1,08,538 మంది చదువుతున్నారు. వీరిపై ఫీజులు,ఇతర విద్యాసామగ్రిపై భారీ పెద్దన భారం పడనుంది.

ఓ పాఠశాలలో తరగతుల వారీగా పుస్తకాల ధరలు ఇలా...

ఎల్‌కేజీ	: 2200
యూకేజీ	: 2500
1వతరగతి	: 3000
2వ తరగతి	: 3500
3వ తరగతి	: 4000
4వ తరగతి	: 4500
5వ తరగతి	: 5,300

కార్పొరేట్ తరహాలో..
నిబంధనలు పక్కన పెడుతూ మూడుపువ్వులు, ఆరు కాయలుగా జిల్లాలో విద్యావ్యాపారం కొనసాగుతోంది. పాఠశాలల్లో ఫీజులు కార్పొరేట్ తరహాలో పెంచేశారు. ప్రవేశ రుసుం రూ. 10 వేలు, ప్రత్యేక ఫీజు రూ.3వేలు వసూలు చేస్తున్నారు. నర్సరీ నుంచి పదోతరగతి వరకు ఫీజులు పెంచేశారు. దుస్తులు, పుస్తకాలు, ట్యూషన్ ఫీజులు, బెల్టులు, బూట్లు,తదితర ధరలు పెంచేసి అందినకాడికి దండుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి రూ.4 వేల నుంచి రూ.5 వేలు వరకు ఖర్చవుతోంది. పిల్లల పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు,టైలు, బెల్టులు, బ్యాగులు, బూట్లు, సాక్సులు, బస్సు చార్జీలు ఒకొక్కరికి సగటున రూ. 10 వేలకుపైగా ఖర్చువస్తోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

నిబంధనలు పాటించాలి
ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు, ఇతర విషయాలపై నిబంధనలు తప్పకుండా పాటించాలి. ఫీజుల పేరుతో అధికంగా వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు. పుస్తకాలు,ఇతర వస్తువులు అధిక ధరలు అమ్మినట్లు సమాచారం వస్తే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

–ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఛామకూరి శ్రీధర్, చిత్రంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రతి ఒక్కరూ ఆచారాల వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంచుకొని మత సామరస్యంతో వ్యవహరిస్తూ జిల్లాలో బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకొని శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి వివిధ శాఖల అధికారులు, అన్ని మతాల మత పెద్దలతో కలెక్టర్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీక అయిన జిల్లాలో ఇటీవల మదనపల్లెలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర శాంతియుతంగా జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో శనివారం బక్రీద్ కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు.జంతువధశాలల వద్ద ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలన్నారు. ఆవులు, దూడలు, ఒంటెల వధకు పాల్పడరాదన్నారు. ప్రతి మండలంలో సమావేశాలు ఏర్పాటు చేసి పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో బక్రీద్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు....
జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లను చేశామన్నారు. ఇందులో భాగంగా 24/7 ప్రకారం కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి జిల్లా నోడల్ అధికారిని కూడా నియమించినట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో రాత్రి 9 నుంచి ఉదయం వరకు పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మాట్లాడుతూ స్లాటర్ హౌస్‌ల వద్ద శానిటేషన్, మంచినీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో శాంతి కమిటీ సభ్యులు మాట్లాడారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వైఖోమ్ నదియాదేవి, డీఆర్‌ఓ మధుసూదన్ రావు, అడిషనల్ ఎస్పీలు ఎం వెంకటాద్రి, మనోజ్ రామనాథ్ హెగ్డే జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి హిదాయతుల్లా, శాంతికమిటీ సభ్యులు, అన్ని మతాల మతపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలి
జిల్లా పరిధిలోని ప్రభుత్వ భూములకు తగిన విధంగా రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో రెవెన్యూ అంశాలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జీఓఎంఎస్ నంబర్- 30 మార్గదర్శకాల మేరకు అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణ రెగ్యులరైజేషన్, రీ సర్వే, ఫ్రీ హోల్డ్ భూములపై తీసుకున్న పీఓటీ కేసులు, 22 (ఏ) భూముల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.

చెయ్యేరులో..ఇసుక దందా!

- యేటిలో జేసీబీలతో ఇసుక తోడివేస్తున్న తమ్ముళ్లు
- నిత్యం టిప్పర్లతో చెన్నై, బెంగళూరుకు తరలింపు
- భూగర్భ జలాలు అడుగంటుతాయని రైతుల ఆందోళన

నాణ్యమైన ఇసుకకు నిలయమైన చెయ్యేరులో ఇసుక దందా కొనసాగుతోంది. రీచ్‌కు అత్యంత సమీపంలో ఉన్న టంగుటూరు, కోమంతరాజుపురం ఇసుక క్వారీలు అధికారికమే అయినప్పటికీ ఇసుక తోడివేత కూటమి నేతల ఇష్టారాజ్యంగా మారింది. టిప్పర్ల ద్వారా ప్యాకేజీలు మాట్లాడుకొని ఎగుమతి చేస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకునే అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి.





చెయ్యేరులో టిప్పర్‌లోకి జేసీబీతో ఇసుక ఎగుమతి చేస్తున్న దృశ్యం, చెయ్యేరు(కోమంతరాజుపురం, టంగుటూరు)లో ఇసుక టిప్పర్లు

రాజంపేట : టంగుటూరు, కోమంతరాజుపురం క్వారీలను అధికార పార్టీ అనుయాయులు టెండర్‌లో దక్కించుకున్నారు. రైల్వేకోడూరు అనధికారిక ఎమ్మెల్యేగా ప్రాచుర్యంలో ఉన్న నేత అనుచరుడికి కోమంతరాజుపురం క్వారీని కట్టబెట్టారు. టంగుటూరు క్వారీని రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి బంధువు, మంగళగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తికి టంగుటూరు క్వారీ కట్టబెట్టారు. అయితే అంతా తమదే రాజ్యం అన్నట్లు నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారం ప్రారంభించి యథేచ్ఛగా తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక టీడీపీ, జనసేన నేతలు పెదవివిరుస్తున్నారు. టంగుటూరు, కోమంతరాజుపురంలోని చెయ్యేరు వద్ద రేయింబవళ్లు మిషన్లు పెట్టి మరీ ఇసుక తవ్వి టిప్పర్లతో చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు తరలించి కాసులు సంపాదిస్తున్నారు.

చెయ్యేరు ఇసుక నాణ్యమైనది కావడంతో..

నాణ్యమైనది కావడంతో చెయ్యేరు ఇసుకకు భారీ డిమాండ్ ఉంది. భవన నిర్మాణ రంగంలో స్లాబ్‌తో పాటు పూతలు, తదితర వాటికి ఈ ఇసుక బాగా పనికివస్తోంది. స్వచ్ఛమైన ఇసుక వుండడంతో చెన్నై, బెంగళూరు వాసులు ఈ ఇసుక ఎక్కువగా అడుగుతున్నారు. ఇదే ఆసరాగా టీడీపీ వర్గీయులు, మరింత మంది కొన్ని వ్యవస్థలను అడ్డంపెట్టుకొని రోజూ అక్రమంగా టిప్పర్ల ద్వారా ప్యాకేజీలు మాట్లాడుకొని ఎగుమతి చేస్తున్నారనే విమర్శలున్నాయి. కూటమి నేతల అండ ఉండడంతో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే అన్ని శాఖల అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి.

వెంటాడుతున్న భూగర్భ జల సమస్య

చెయ్యేరులో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇసుక విచ్చలవిడిగా తోడేస్తున్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటి పోతాయని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గంలోని చెయ్యేరు నదీపరీవాహక ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని, తవ్వకాలు తార స్థాయికి చేరుకున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవంటున్నారు. అడ్డగోలు ఇసుక తరలింపుపై మైన్స్, రెవెన్యూ, పోలీసుశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. క్వారీలు దక్కించుకున్న వారు ఏవిధంగా ఇసుక డంపింగ్‌కు తీసుకొస్తున్నారు? ఏ విధంగా తవ్వుతున్నారన్నదే క్షేత్ర స్థాయిలో మైన్స్ అధికారులు తనిఖీలు చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే నిబంధనలకు విరుద్ధంగా జరిగే తవ్వకాలు ఆపాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యార్థిని అదృశ్యం

బి.కొత్తకోట : స్థానిక జయశ్రీ కాలనీ చెందిన విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. 19 ఏళ్ల విద్యార్థిని బీసీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 4న తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న విద్యార్థిని కనిపించలేదు. ఆచూకీ కోసం గాలించినా కనిపించలేదు. దీంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



మృతి చెందిన ఆటో డ్రైవర్

రాజంపేట : రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డులోని ఎస్‌ఆర్‌పాలెం సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ నాగరాజు(40) దుర్మరణం చెందారు. మృతుడు రాజంపేట పట్టణంలోని సుద్దగుంతలకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఆటో నడుపుకొని జీవిస్తున్న కుటుంబం ఇప్పుడు పెద్దదిక్కును కోల్పోయి కన్నీటిపర్యంతమవుతోంది. ఆటోను ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ ఢీకొందని, కేసుపై పోలీసులపై ఒత్తిడి పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నమయ్య సామిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

రాజంపేట రూరల్ : నందలూరు మండలం ఎర్రిపాపయ్యగారిపల్లికి చెందిన పి.హరికృష్ణ జీవనోపాధి కోసం డివిజనల్ సబ్ స్టేషన్ సమీపంలో సామిల్లు నడుపుకొంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఉన్నపాటుగా మిల్లులో మంటలు చెలరేగి కొయ్యలు దగ్ధమయ్యాయి. రాజంపేట అగ్నిమాపక అధికారి కే.మాబుసుభాన్, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. జిల్లా అగ్నిమాపక అధికారి సునీల్ కుమార్ శుక్రవారం ఆ స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని శివాలయం సెంటర్ సమీపంలోని మైదుకూరు రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. అతను శుక్రవారం రోడ్డుపై పడిపోయి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. టూటౌన్ ఎస్‌ఐ రాఘవేంద్రారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎస్‌ఐ ఆరా తీశారు. అతడికి సంబంధించిన వివరాలు లభించకపోవడంతో మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సుమారు 35ఏళ్లు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. మద్యం మత్తులో డీ హైడ్రేషన్ కారణంగా అతను చనిపోయి ఉంటాడని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులుంటే టూ టౌన్ పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



తమ తండ్రి ప్రాణాలు కాపాడాలని వేడుకుంటున్న కుమారుడు

ఓబులవారిపల్లె : నగలు అమ్మి వైద్యం చేయించినా నయం కాకపోవడంతో ఆ కుటుంబం అల్లాడిపోతోంది. లక్షల రూపాయలు చికిత్సకు ఇంకా కావాలని చెప్పడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. మండలంలోని చిన్నఓరంపాడు దళితవాడ గ్రామానికి చెందిన కోటపాడి ఉమామహేశ్వరరావు పెగలూరు మండల మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉమా మహేశ్వరరావుకు భార్య ఉమాకుమారి, ఇద్దరు కుమారులు జతిన్‌కుమార్, గణపతి ఉన్నారు. వీరు రైల్వేకోడూరులోని అద్దె ఇంటిలో కాపురం ఉంటున్నారు. ఉమా కుమారి కుట్టు మిషన్ కుడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 5న కింద పడిపోవడంతో కుటుంబ సభ్యులు తిరుపతి ఆసుపత్రిలో చేర్పించారు. శరీరంలోని అవయవాలు పనిచేయడం లేదని.. చెప్పడంతో చికిత్స కోసం దాదాపు పది లక్షల రూపాయలు బంగారు అమ్మి, అప్పు చేసి చెల్లించారు. ఇంకా లక్షల రూపాయల ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చి చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. భర్తకు వచ్చిన జీతాలు పోగా ఆస్తులు అమ్మి డబ్బు ఆసుపత్రికి కట్టినా ఇంకా నయం కాకపోవడంతో మరింత ఖర్చు అవుతుందని వైద్యులు తేల్చడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. దాతలు ఆర్థిక సహకారం అందించి తమ తండ్రి ప్రాణాలు కాపాడాలని కుమారులు కోరుకుంటున్నారు.

ఉరికి వేలాడుతూ వివాహిత మృతి

అత్త, భర్త వేధింపులతోనే చనిపోయిందని తల్లిదండ్రుల ఫిర్యాదు



తేజశ్రీ (ఫైల్)

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఉరికి వేలాడుతూ అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో వెలుగుచూసింది. బాధితుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, బికేపల్లి కాలనీకి చెందిన శివకేశవ, రెడ్డమ్మ దంపతుల కుమార్తె తేజశ్రీ (23)ను మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లి చౌడేశ్వరీనగర్‌కు చెందిన రఘుకు ఇచ్చి రెండేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి ఏడాది కుమారుడు ఆదిత్య ఉన్నాడు. రఘు చేనేత చీరలకు రంగులద్దుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా రఘు మద్యానికి బానిస కావడంతో భార్యా, భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అదనపు కట్నం తేవాలని, మనుమడు తేజశ్రీకి ఆభరణాలు చేయించాలని కొంతకాలంగా కోడలు అత్త చల్లమ్మ వేధిస్తోంది. ఈ క్రమంలో రఘు స్వగ్రామం తమిళనాడు రాష్ట్రం సేలంలో జాతరకు వెళ్లాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. గురువారం రాత్రి పొద్దుపోయినా రఘు ఇంటికి రాకపోవడంతో తేజశ్రీ భర్తకు ఫోన్ చేసింది. జాతరకు బయలుదేరాలి కదా.. త్వరగా ఇంటికి రమ్మని చెప్పింది. అయితే తనకు పని ఉందని, వేరే చోట పార్టీ ఉందంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన తేజశ్రీ ఇంట్లో తలుపునకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బిడ్డ ఆదిత్య ఏడుపు విన్న స్థానికులు తలుపు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అల్లుడి ఇంటి వద్దకు చేరుకున్న తేజశ్రీ తల్లిదండ్రులు విషయం తెలుసుకుని ఆస్పత్రికి వెళ్లగా అప్పటికే కుమార్తె మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించడంతో కన్నీటిపర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చే గదికి తరలించారు. తమ కుమార్తె మృతికి భర్త, అత్త వేధింపులే కారణమని, ఒంటిపై గాయాలున్నాయని, అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తండ్రి శివకేశవ, టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కమాండెంట్ మహేష్‌కుమార్



పరేడ్‌ను పరిశీలిస్తున్న కమాండెంట్ మహేష్ కుమార్

రాయచోటి : హోంగార్డు సంక్షేమానికి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు కృషి చేస్తున్నారని హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ అన్నారు. రాయచోటి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డు కవాతును శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది దురలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఉపయోగాలు ఉంటాయని వివరించారు. ట్రాఫిక్ రెగ్యులేషన్, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలను అరికట్టడంలో పోలీసులకు వెన్నుదన్నుగా హోంగార్డులు ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.ప్రసాద్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం.పెద్దయ్య, బాలాజీ, రమేష్, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ముగిసిన శిక్షణ



ప్రకృతి వ్యవసాయ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయంపై టీఓటీ శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై గోడ పత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఓటీ(ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్) ఈవీసీ విజయ్ కుమార్ మాట్లాడుతూ నేచురల్ ఫార్మింగ్ సమర్థవంతంగా పనిచేయాలంటే వ్యవసాయశాఖతోపాటు అధికారులు సహకరించాలని సూచించారు. మార్కెటింగ్, పీఎండీఎస్ మోడల్ గురించి వివరించి చెప్పారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఏడీఏలు, ఏపీసీఎన్‌ఎఫ్‌లు పాల్గొన్నారు.

కాలుష్యాన్ని అంతం చేయాలి

రాయచోటి టౌన్: ప్లాస్టిక్‌ను అంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2025 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలనే అంశంపై అవగాహన కల్పించే పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి ప్లాస్టిక్ వస్తువులను నివారించడం, ప్రత్యామ్నాయ పదార్థాలను తయారుచేసి ఉత్పత్తులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు పాల్గొన్నారు.


పది మూల్యాంకనంలో నిర్లక్ష్యం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : పదో తరగతి ఫలితాల మూల్యాంకనంలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర చక్రధర్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు జంగంరెడ్డి కిషోర్‌దాస్ అన్నారు. మంత్రి లోకేష్ రాజీనామా కోరుతూ డీఈఓ సుబ్రహ్మణ్యంను శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మందికి పైగా విద్యార్థులు మానసిక ఆందోళనకు గురయ్యారని, మూల్యాంకనంలో లోపాలతో అనుత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థి తమ మార్కుల జాబితాపై అనుమానంతో ఉన్నారని, రీవాల్యుయేషన్‌కు ఎలాంటి ఫీజు లేకుండా అవకాశం కల్పించాలన్నారు. తుది ఫలితాలు వచ్చే వరకూ పది మార్కుల ఆధారంగా జరిగే అడ్మిషన్లను నిలిపివేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వర్‌రెడ్డి, మణికంఠారెడ్డి, యూసఫ్‌ఖాన్, లోకనాథం, శివకుమార్, మొఘల్ ఫైజాన్‌బేగ్, సయ్యద్ ఫైజాన్, జగదీష్, షేక్ ఒబైజ్, షేక్ మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

13న వెలిగల్లు ఉద్యానవనంలో యోగాంధ్ర



వెలిగల్లు ఉద్యానవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : ఈ నెల 13న వెలిగల్లు ఉద్యానవనంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం, టూరిజం అధికారి నాగభూషణం తెలిపారు. మండల ఎంపీడీఓ జవహర్‌బాబుతో కలసి గాలివీడు మండలంలోని వెలిగల్లు ఉద్యానవన స్థలాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ యోగా ద్వారా ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ప్రశాంతంగా జీవించగలరని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ హరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని దువ్వూరు రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన మేరకు.. గంజాయి విక్రయిస్తున్నారని సమాచారంతో ప్రొద్దుటూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీవీ.సురేంద్రరెడ్డి, కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నీలకంఠేశ్వరరెడ్డి, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. దాడిలో హుస్సేన్ బాషా, సంతోష్, కార్తీక్‌లను అరెస్టు చేసి వారి నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గుప్త నిధుల ముఠా విధ్వంసం

- హనుమాన్ విగ్రహం, ధ్వజ స్తంభం తొలగింపు
- సొరంగంలా తవ్వి వదలేసిన దుండగులు



సొరంగంలా తవ్విన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు వ్యాసరాయసముద్రం చెరువు కట్టపై ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టి విధ్వంసం సృష్టించారు. నిమ్మకాయలతో మంత్రించిన అనంతరం క్షుద్ర పూజలు చేసి ఆంజనేయస్వామి విగ్రహాన్ని, బలమైన రాతి దూలాలు తొలగించారు. సొరంగాన్ని తలపించేలా లోతుగా తవ్వి ఆలయంబయట ధ్వజ స్థంభాన్ని పెకిలించారు. నిర్జన ప్రదేశంలో ఆలయాలు ఉండడంతో దుండగులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టారు. చెరువు సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు, సర్పంచ్ రహ్మతుల్లా, సిబ్బంది ఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కట్ట దిగువ ఉన్న పురాతన వేదగిరి లక్ష్మినరసింహస్వామి ఆలయంలోనూ గత ఏడాది గోపురం, ధ్వజ స్తంభాలు పెకిలించారు. గుప్త నిధుల ముఠా సభ్యుల సంచారంపై పోలీసులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహల్‌లో బ్యానర్లకు చిచ్చు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఫొటోలు ఉండడమే కారణం
- టీడీపీ నేత అనుచరుడే పెట్రోలు పోసి తగలబెట్టిన వైనం



యర్రదొడ్డిపల్లిలో బ్యానర్‌కు పెట్రోలు పోసి నిప్పు పెడుతున్న హరీష్

కలికిరి : మండలంలోని గుండ్లూరులో వెలసిన మూలస్థానమ్మ తిరునాల ప్రారంభం కానున్న నేపథ్యంలో అద్దవారిపల్లి పంచాయతీ పరిధిలోని మహల్ యర్రదొడ్డిపల్లి వైఎస్సార్‌సీపీ యువత బ్యానర్ ఏర్పాటుచేశారు. ఇది ఓర్వలేని టీడీపీ నాయకుడైన సతీష్‌రెడ్డి అనుచరుడు హరీష్ శుక్రవారం మధ్యాహ్నం 1.50గంటల సమయంలో తన వెంట తెచ్చుకున్న పెట్రోలు బ్యానర్‌పై పోసి నిప్పంటించాడు. స్థానిక సీసీ కెమరాల్లో రికార్డవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, రిజ్వాన్, యువత పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఏర్పాటు చేసిన గుండ్లూరు మూలస్థానమ్మ జాతర బ్యానర్‌పై పెట్రోలు నిప్పుటించడం హేయమైన చర్య అని పలువురు అసహనం వ్యక్తం చేశారు.

ఉద్యోగాల పేరిట చీటింగ్

కడప అర్బన్ : ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సొమ్ము తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు దేరంగుల సులోచన, భర్త నరేష్, దేరంగుల అనులు ఆవేదన వ్యక్తం చేశారు. కేసులో నిందితులైన గిద్దలూరు సుబ్బరాయుడు, అతడి భార్య ఉమామహేశ్వరిలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరిపై కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు తెలిపారు. బాధితుల వివరాల మేరకు.. అక్కా చెల్లెళ్లయిన తాము నర్సింగ్ కోర్సు పూర్తి చేశామని, కరోనా సమయంలో రిమ్స్‌లో తాత్కాలిక నర్సులుగా పనిచేశామని దేరంగుల సులోచన, ఆమె అక్క అనులు తెలిపారు. ఆ సమయంలో కడప రిమ్స్ హాస్పిటల్ నందు నర్స్‌గా పని చేసే ఉమామహేశ్వరి పరిచయం అయిందన్నారు. తన భర్త గిద్దలూరు సుబ్బరాయుడుకు కడప రిమ్స్ హాస్పిటల్‌లో అధికారులు పరిచయం ఉన్నారని, పర్మినెంట్ నర్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఉమామహేశ్వరి చెప్పిందన్నారు. ఇందుకోసం తాను తన అక్కఇద్దరు కలిసి తమ దగ్గరికి వచ్చి ఒకరు రూ.1,80,000, మరొకరు రూ.1,25,000 తమ దగ్గరి నుంచి తీసుకున్నారన్నారు. ఆ తరువాత ఉద్యోగం ఇప్పించకుండా.. డబ్బు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. గట్టిగా అడిగితే మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోమంటూ బెదిరిస్తున్నారన్నారు. వారిద్దరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

మోటార్ బైక్ దగ్ధం

వేంపల్లె : మంటలు చెలరేగి ఆటో రిక్షా అమర్చిన మోటార్ బైక్ దగ్ధమైంది. వేంపల్లెకు చెందిన రహంతు ల్లా మోటార్ బైక్‌కు రిక్షా బిగించుకుని మూటలు మోస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి పులివెందుల రోడ్డులోని టీఎంఆర్ సూపర్‌మార్కెట్ వద్ద వాహనాన్ని నిలిపి ఉండగా, ఒక్కసారిగా మోటార్ బైక్ లో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుప్రక్కల వారు మంటలను అదుపుచేసేందుకు నీటిని చల్లడంతో ఆటో రిక్షా కాలిపోలేదు. అయితే అప్పటికే మోటార్ బైక్‌కాలిపోయింది. కూలి పనులు చేసుకునే తనకు మోటార్ బైక్ తెచ్చుకునే స్థోమత లేదని, ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

పాత కక్షలతోనే ఆంజనేయులు హత్య

వీరపునాయునిపల్లె : పాత కక్షలతోనే అనిమెల ఆంజనేయులు హత్య జరిగిందని, ఆ కేసులో నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేశామని పెండ్లిమర్రి సీఐ చల్లనిదొర తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వీరపునాయునిపల్లెకు చెందిన బెలుకూరు నవీన్, నరేష్‌లకు ఇంటి వద్ద గత పదేళ్లుగా తగాదా ఉండేదన్నారు. 2014లో అదే గ్రామానికి చెందిన బోగాది చీనీ, నిమ్మ చెట్లను ఆంజనేయులు నరికి వేయగా, దీనిపై కేసు నమోదైందన్నారు. ఇటీవల నరేష్ కుటుంబీకులను ఆంజనేయులు బెదిరించడంతో అతడితోపాటు నవీన్, బోగాది కలిసి ఆంజనేయులను హత్య చేయాలని భావించారు. బెలుకూరి రెడ్డిమహేష్ ఆంజనేయులు ఇంటికి వస్తున్న సమాచారాన్ని అందించాడు. దీంతో గత నెల 27న ఆంజనేయులు ఇంటికి వెళ్తుండగా.. కాపు కాసి రోకలిబండతో కొట్టి, పిడి బాకులతో పొడిచి గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. గురువారం సాయంత్రం 6.03 గంటలకు నిందితులను అదుపులోకి తీసుకొని నేరానికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్ర వారం కమలాపురం కోర్టులో హాజరుపరచినట్లు తెలియజేశారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి

అనంతపురం సిటీ : అనంతపురం రైల్వే స్టేషన్‌లో కదిలే రైలు ఎక్కబోయి.. ప్రమాదవశాత్తూ అదుపు తప్పి పడిపోయిన దూదేకుల సంజీవరాయుడు(60) మరణించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం మేరకు.. సంజీవరాయుడుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ఎర్రగుంట్లలోని చిన్న కొడుకు వద్ద ఉంటున్న రాయుడు హోటల్‌లో పనిచేసుకుంటూ కాలం వెళ్లదీసేవాడు. తాగుడు అలవాటు ఉన్న రాయుడు.. యథావిధిగా హోటల్‌లో పని ముగించుకొని.. మందుకొట్టి గురువారం రాత్రికి వెళ్లాడు. దీంతో చిన్న కొడుకు తిట్టడంతో మనస్తాపానికి గురైన రాయుడు రాత్రికి ఇంటి నుంచి వచ్చేసి ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లోనే పడుకున్నాడు. శుక్రవారం ఉదయమే మచిలీపట్నం-ధర్మవరం రైలెక్కి వచ్చేశాడు. రైలు అనంతపురం చేరుకోగానే నీళ్ల కోసం దిగిన రాయుడు.. రైలు కదులుతుండడం చూసి ఎక్కేందుకు ప్రయత్నించాడు. అయితే అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే అతన్ని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సర్వజనాస్పత్రి మార్చురీకి తరలించారు.

సమాజ సేవే ముఖ్యం

– భారతి సిమెంట్ సీఎంఓ సాయి రమేష్

కమలాపురం : తమ పరిశ్రమ కేవలం వ్యాపారం మాత్రమే చేయడంలేదని, దాంతోపాటు సమాజ సేవలో ముందుందని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. స్థానిక క్రాస్ రోడ్డు వద్దగల ఆర్‌సీఎం ఆసుపత్రి భవనంలో పలువురికి శిక్షణ సర్టిఫికెట్లు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీసీపీఎల్ ఆర్థిక సహకారంతో సంభవ్ ఫౌండేషన్ పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల పేదలకు ఆర్‌టీసీ ద్వారా ఉచితంగా 32 రోజుల శిక్షణ ఇచ్చి హెవీ లైసెన్స్ ఇప్పించారన్నారు. ఇప్పటికే పలు చోట బస్ షెల్టర్లు, నీటి శుద్ధి కేంద్రాలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డయాలసిస్, హిమో డయాలసిస్ సెంటర్లు, మరుగుదొడ్లు ఏర్పాటుచేశామన్నారు. దత్తత గ్రామాల పాఠశాలల్లో ఫర్నిచర్‌తోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. ప్రస్తుతం డ్రైవర్లకు శిక్షణ నిచ్చి హెవీ లైసెన్స్ ఇప్పించడంతోపాటు ఆర్టీసీలోనే ఉపాధి కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ చీఫ్ మేనేజర్లు గోపాల్‌రెడ్డి, పేర్ల భార్గవ్ రెడ్డి, సీఎస్ఆర్ చీఫ్ నీతేశ్వర్, ఫౌండేషన్ జీఎం గిరిధర్ రెడ్డి, ఆర్టీసీ ట్రైనర్ జబ్బార్ వలి, సిబ్బంది పాల్గొన్నారు.